సాక్షి
నంద్యాల

ఆదివారం ; 26 ; ఫిబ్రవరి ; 2023




సేవలకు సన్మానం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రాన్ని స్వచ్ఛంగా ఉంచిన పారిశుద్ధ్య సిబ్బందిని శనివారం దేవస్థానం అధికారులు సన్మానించారు.



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి శనివారం తెలంగాణ రాష్ట్రం వికారాబాద్‌కు చెందిన విక్రమ్‌కుమార్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 149 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో దీక్ష విరమణ



హోమం నిర్వహిస్తున్న దీక్షాపరులు

ఆళ్లగడ్డ: నియమ నిష్ఠలతో 41 రోజుల పాటు శ్రీ అహోబిల లక్ష్మీనారసింహ స్వామి దీక్ష చేపట్టిన భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో దీక్ష విరమణ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇరుముడితో కాలినడకన నవనారసింహ క్షేత్రం చేరుకున్నారు. తెల్లవారు జామున ఎగువ అహోబిల దేవస్థానంలో పుణ్యస్నానం ఆచరించి వేదపండితుల ఆధ్వర్యంలో మాలోల నృసింహస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్నారు. దీక్షాపరులతో పాటు వారి కుటుంబ సభ్యులు భారీగా తరలిరావడంతో అహోబిలం క్షేత్రం గోవింద నామస్మరణతో పులకించి పోయింది.

శనగల కొనుగోళ్లు ప్రారంభం



అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన శనగలు

నంద్యాల(అర్బన్): రైతు భరోసా కేంద్రాల్లో శనివారం శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు పరిశీలించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 25వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రబీలో 1.11 లక్షల ఎకరాల్లో శనగ సాగుచేయగా 35,636 మంది ఈ క్రాప్ నమోదు చేసుకున్నారన్నారు. మొత్తం 93872.93 మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశామన్నారు. 356 ఆర్బీకే కేంద్రాల పరిధిలోని శనివారం నాటికి వరకు 2,079 మంది రైతులు సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కొత్త గోనెసంచులు, సరుకు రవాణా చేసే వాహనాలను మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తుందన్నారు. నాణ్యతను బట్టి కొనుగోళ్లు ఉంటాయన్నారు.

అన్న ప్రసాద వితరణ పథకానికి విరాళం



దాతలకు స్వామిఅమ్మవార్ల లడ్డూ ప్రసాదాలను అందజేస్తున్న అధికారులకు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చిత్తూరుకు చెందిన బోధనాద స్వామి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

ఎన్‌సీడీసీ రుణాలు గడువులోపు చెల్లించండి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) రుణాలు ఏటా గడువులోప చెల్లించాలని లేకపోతే వడ్డీభారం పడుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య అన్నారు. శనివారం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్‌సీడీసీ విడుదల చేసిన రూ.7.46 కోట్లను 208 మందికి రుణంగా అందించినట్లు వెల్లడించారు. సమావేశంలో గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఎండీ డాక్టర్ సుభాన్‌బాషా, ఐసీడీపీ సీఈఓ వెంకటకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



కష్టానికి ఫలితం..
ఉద్యాన వికాసం!

రైతుల కోసం 'టెర్మినల్ మార్కెట్'

- ఉద్యాన రైతులకు లాభం చేకూర్చే లక్ష్యం
- బెంగళూరు-హైదరాబాద్ హైవేపై ప్యాపిలి వద్ద నిర్మాణం
- ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో మాత్రమే టెర్మినల్ మార్కెట్లు
- 31 ఎకరాల్లో రూ.49.07 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వం
- గ్రేడింగ్, ప్యాకింగ్, స్టోరేజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఉద్యాన రైతులు పండించే ఉత్పత్తులకు అత్యుత్తమ ధరలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. రైతుల కష్టానికి పూర్తి ప్రతిఫలం దక్కేలా శాశ్వత చర్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపక్రమించారు. ఇందుకోసం రాష్ట్రంలో 'టెర్మినల్ మార్కెట్ యార్డు' నిర్మాణానికి సంకల్పించారు. దేశంలోని ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఒడిశా తర్వాత నాలుగో 'టెర్మినల్ మార్కెట్'ను రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఏర్పాటు చేస్తున్నారు. గ్రేడింగ్ చేసి 'ఈ–నామ్' ద్వారా విక్రయాలు జరపడం, ధర గిట్టుబాటు కాకపోతే అక్కడే నిల్వ చేసుకునే అవకాశం ఉండేలా దీనిని నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే ఉద్యాన పంటలు అత్యధికంగా సాగు చేసే రాయలసీమతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, తెలంగాణ, కర్ణాటకలోని పలు జిల్లాల రైతులకు మేలు కలుగుతుంది.

రైతులకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా..

ప్రస్తుతం రైతులు వారు పండించిన ఉద్యాన పంటలను మార్కెట్‌కు నేరుగా ట్రాక్టర్లలో తీసుకొచ్చి బాక్స్‌లు లేదా టన్నుల వంతున లాట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల 'లాట్' మొత్తానికి ఒకే ధర దక్కుతోంది. తద్వారా రైతుకు నష్టం వాటిల్లుతోంది. టెర్మినల్ మార్కెట్‌లో ప్రతి పంటను శుభ్రం చేసి కాయలు లేదా పండ్లను కేటగిరీల గ్రేడింగ్ చేస్తారు. ఆ తర్వాత రంగు, నాణ్యత, సైజు ఆధారంగా ధరలు నిర్ణయిస్తారు. దీంతో క్వాలిటీ ఉత్పత్తులకు అధిక ధర, మధ్యస్థంగా ఉన్న వాటికి ఒక ధర, నాణ్యత తక్కువ ఉన్న వాటికి మరో ధర లభిస్తుంది. ఇలా గ్రేడింగ్ చేసి విక్రయించడం వల్ల రైతుకు లాభం చేకూరుతుంది.

బెంగళూరు-హైదరాబాద్ మధ్య నిర్మాణం

కశ్మీర్–కన్యాకుమారి జాతీయ రహదారి–44ని అనుకుని ప్యాపిలి వద్ద 31 ఎకరాల్లో రూ.49.07 కోట్లతో టెర్మినల్ మార్కెట్ నిర్మించనున్నారు. ఈ మార్కెట్ నుంచి బెంగళూరు 285, హైదరాబాద్ 293 కిలోమీటర్లు దూరం. ఉద్యాన పంటలు సాగుచేసే కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మధ్య రవాణాకు వీలుగా దీనిని నిర్మిస్తున్నారు. ఈ మార్కెట్ చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల రైతులు కూడా ఉపయోగపడనుంది. దీని నిర్మాణానికి రూ.49.07 కోట్ల వ్యయం కానుండగా.. పీపీపీ విధానంలో పనులు చేపడతారు. రూ.12 కోట్లను ఉద్యాన శాఖ కేటాయిస్తుంది. మిగిలిన మొత్తం ఏజెన్సీ ఖర్చు చేయాలి. రైతులకు మేలు చేసే ఈ ప్రాజెక్ట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

టెర్మినల్ ప్లాంట్‌లో నిర్మాణాలు ఇలా



హోల్‌సేల్ దుకాణాలు 36	
సెమీ రిటైల్ దుకాణాలు 20	
రిటైల్ దుకాణాలు 66	రైపనింగ్ చాంబర్లు 6
ప్రీ కూలింగ్ చాంబర్లు 2	కోల్డ్‌స్టోరేజీలు 4 చాంబర్లు
ప్రాసెసింగ్ బ్లాక్ 1	ఎస్‌టీపీ 20 కేఎల్‌డీ
ఈటీపీ150 కేఎల్‌డి	వే బ్రిడ్జి 1
ఓవర్ హెడ్ ట్యాంక్ -లక్ష లీటర్లు	

రైతులకు ఎంతో మేలు

టెర్మినల్ మార్కెట్‌తో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. ఈ–నామ్ ద్వారా ఎవరు ఎక్కువ ధర కోట్‌చేస్తే వారు కొనుగోలు చేస్తారు. దళారీ వ్యవస్థ ఉండదు. ఈ–నామ్‌లో ఎవరైనా ధరలు కోట్ చేయొచ్చు. పంటలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నాణ్యత ఆధారంగా విక్రయించడం ద్వారా రైతులకు అధిక లాభం దక్కుతుంది. ధరలు లేనప్పుడు టెర్మినల్‌లోనే నిల్వ చేసుకోవచ్చు. దుకాణాల నుంచి స్టోరేజీ వరకూ.. క్లీనింగ్ నుంచి ప్యాకింగ్ వరకూ అన్ని వసతులు టెర్మినల్ మార్కెట్ యార్డులో ఉంటాయి.

– నాగరాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నంద్యాల

28న మూడో విడత 'పీఎం కిసాన్–వైఎస్ఆర్ రైతుభరోసా'

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్–వైఎస్ఆర్ రైతు భరోసా కింద నాలుగవ ఏడాదికి సంబంధించి మూడో విడత ఆర్థిక సహాయం ఈ నెల 28న విడుదల కానుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 27న విడుదల కావాల్సి ఉండగా.. ఈ కార్యక్రమాన్ని మరునటి రోజుకు మార్పు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందింది. మూడో విడత ఆర్థిక సహాయం విడుదలతో పాటు మూడు నెలల క్రితం మాండూస్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కానుంది. మాండూస్ తుపాను ప్రభావం కర్నూలు జిల్లాలో లేదు. నంద్యాల జిల్లాలో వ్యవసాయ పంటలు 1568.02 హెక్టార్లు, ఉద్యాన పంటలు 13.07 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. ఇందుకు సంబంధించి రూ.164.49 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానుంది.

పీహెచ్‌సీల్లో ఇకపై 14 మంది ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 14 మంది (స్టాఫ్ ప్యాట్రన్) ఉద్యోగులు సేవలందించేలా ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు(మెడికల్ ఆఫీసర్లు), ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్, ఒక గ్రేడ్–2 ఫార్మాసిస్టు, ఒక సీహెచ్‌వో/ఎంపీహెచ్‌ఈవో, ఒక హెల్త్ ఎడ్యుకేటర్/పీహెచ్‌ఎన్, ఒక ఎంపీహెచ్‌ఎస్(ఫిమేల్), ఒక ఎంపీహెచ్‌ఎస్(మేల్), ఒక ఎల్‌డీ కంప్యూటర్/జూనియర్ అసిస్టెంట్/సీనియర్ అసిస్టెంట్, ఒక ఎఫ్‌ఎన్‌ఓ, ఒక శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మన్ ఉంటారు. జిల్లాలోని మొత్తం 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి పీహెచ్‌సీలో ఇదే విధమైన స్టాఫ్ ప్యాట్రన్ ఉండబోతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనుంజయ వై.చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులతో మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా తదితరులు


శ్రీశైలంలో సీజేఐ

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనుంజయ వై.చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు శనివారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్నారు. వీరితో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు ఉన్నారు. భ్రమరాంబా అతిథిగృహం చేరుకున్న న్యాయమూర్తులకు ఏపీ పట్టణ, పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఏపీ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎమ్.హరిజవహర్‌లాల్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి(కర్నూలు) ఎన్.శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్‌జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్. లవన్న పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.


ఏర్పాట్ల పరిశీలన

సీజేఐ ధనుంజయ వై.చంద్రచూడ్ రెండు రోజుల శ్రీశైలం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం ఉదయమే శ్రీశైలం చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈఓ లవన్న, తదితర అధికారులతో సమీక్షించారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆదివారం ఉదయం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహణపై క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు.

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేకాలంకరణలో విష్వక్సేనుడు



విష్వక్సేనుడిని మండపానికి తోడ్కొని వస్తున్న పీఠాధిపతి, వేద పండితులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ పూజలు చేశారు. అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎగువ అహోబిలంలోని శ్రీ జ్వాల నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడికి పూలమాలలు వేసి, తల పాగా చుట్టి పల్లకిలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా విష్వక్సేనుడు వ్యవహరిస్తారని విశ్వాసం. అనంతరం పుట్టమన్ను సేకరించి మండపం వద్ద అంకుర హోమం నిర్వహించి సోముడిని (చంద్రుడిని) మట్టిలోకి ఆవాహం, సోమకుంభ స్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, జీపీఏ సంపత్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం భేరీపూజ, మధ్యాహ్నం అభిషేకం, రాత్రి స్వామి సింహవాహన సేవ నిర్వహిస్తారు. దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా సాయంత్రం వేదపండితుల అంకురార్పణ పూజలు నిర్వహిస్తారు.

కుటిల రాజకీయాలను తిప్పికొడదాం

ప్రభుత్వ సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయి

- మెజారిటీ లేకపోయినా 'స్థానిక సంస్థల్లో' టీడీపీ నామినేషన్
- ఉద్యోగాల కల్పన, అభివృద్ధిపై ఓటర్లకు అవగాహన కల్పించాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించాలి
- మంత్రులు పెద్దిరెడ్డి, బుగ్గన



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి బుగ్గన, నంద్యాల, కర్నూలు జిల్లాల పార్టీ అధ్యక్షులు కాటసాని, బీవై రామయ్య, రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి ఎన్నికల్లో టీడీపీ నేతల కుటిల రాజకీయాలను తిప్పికొడదామని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలి ఎన్నికల నేపథ్యంలో శనివారం కర్నూలులోని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెజారిటీ లేకపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ నామినేషన్ వేయించిందని, దీంతో పాటు పలు చోట్ల ఇండిపెండెంట్లను రంగంలోకి దించిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగూ ఓటమి తప్పదనే ఆ పార్టీ నేతలు దూరంగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయని, అయితే మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిన, చేయబోయే మంచి పనులు, జరిగిన మేలును ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. ఉద్యోగాల కల్పన, అభివృద్ధిపై ఓటర్లకు అవగాహన కల్పించాలని, భావితరాలకు మంచి చేకూరేలా సీఎం తీసుకున్న మంచి నిర్ణయాలను యువతకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు.

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఎంతో చేస్తుందన్నారు. స్థానిక సంస్థల నుంచి పట్టసభల వరకు బీసీలకు అత్యధిక శాతం సీట్లు ఇచ్చిన ఏకైక పార్టీ తమదేనని, దీంతో అణగారిన వర్గాలకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభించిందని వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని, ఇటీవలే శాసన మండలి ఎన్నికల్లో 75 శాతం టికెట్లు ఇచ్చి మరోసారి బీసీల పార్టీ అని నిరూపించుకుందన్నారు. స్థానిక సంస్థలతో పాటు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించేలా పని చేయాలని పార్టీ నేతలకు సూచించారు.
- ఉమ్మడి జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. అయితే భారీ మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని, ఒక్క ఓటూ పక్కకి వెళ్లడానికి వీలు లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ గతంలో ఏ ఎన్నిక జరిగినా వైఎస్ఆర్‌సీపీ విజయం సాధించిందని, వచ్చే ఎన్నికల్లోనూ అదే జరుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వచ్చిన మండలి ఎన్నికలు తమకు ప్రీ ఫైనల్ లాంటివని, సమష్టిగా శ్రమించి భారీ విజయాన్ని జిల్లా తరఫున సీఎంకు కానుకగా ఇవ్వాలన్నారు.
- మండలి అభ్యర్థులు డాక్టర్ ఎ.మధుసూదన్(స్థానిక సంస్థలు), వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రులు), ఎం.వి.రామచంద్రారెడ్డి(ఉపాధ్యాయులు) మాట్లాడుతూ పేదలకు మంచి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్న సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పని చేసే తమను ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తమ గెలుపు సంక్షేమ ప్రభుత్వానికి మరింత బలం చేకూరుస్తుందన్నారు.
- సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, సి.ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తొగురు ఆర్థర్, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, డాక్టర్ సుధాకర్, కంగాటి శ్రీదేవి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు.

వైభవంగా గురుభక్తి ఉత్సవాలు



రాములోరికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీమఠంలో రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. శనివారం ఐదో రోజున పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువ జామునే రాఘవేంద్ర స్వామికి సుప్రభాత సేవ, ఊంజలసేవ, దివిటి సేవలు నిర్వహించారు. పూజా మందిరంలో భక్త జనం మధ్య మూలరామ, జయరామ, దిగ్విజయ రాములకు సంస్థాన పూజలు చేశారు. సాయంత్రం యోగీంద్ర మంటపంలో పలువురు ప్రముఖులకు పీఠాధిపతి చేతుల మీదుగా రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేశారు. పూజల్లో ఏపీ హైకోర్టు జడ్జి రవిచీమలపాటి, బెంగళూరు హైకోర్టు జడ్జి అనిల్ భీంసేన్, ముంబాయి హైకోర్టు న్యాయ మూర్తి కేఆర్ శ్రీరామ్, బెంగళూరు వైద్యులు కామిని రావు, హంపి విరుపాక్షి ఆలయ అర్చకులు శ్రీనాథ్ శాస్త్రి అవార్డులు అందుకున్నారు.

వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఖాళీగా ఉన్న వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కేవీకే సమన్వయకర్త డా. సుజాతమ్మ కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఎస్సీ అగ్రికల్చర్ చదివిన వారు ఈ పోస్టుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులకు మార్చి 13వ తేదీన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.kvkbanavasi-angrau.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పునఃమూల్యాంకన ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధి లో గతేడాది జూన్ నెలలో జరిగిన బీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షల పునఃమూల్యాంకన ఫలితాలు శనివా రం వర్సిటీ పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో విడుదల చేశారు. 971 మంది విద్యార్థు లుపునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకో గా.495 మంది ఇందులో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించా రు. ఫలితాల కోసం https://rayalaseemauniversity.ac.inను సంప్రదించాలని పేర్కొన్నారు.

కర్నూలులో పోక్సో యాక్ట్ ప్రత్యేక కోర్టు

- రేపు ప్రారంభించనున్న చీఫ్ జస్టిస్

కర్నూలు(లీగల్): కర్నూలులో కొత్తగా మరో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు కానుంది. పీఓసీఎస్ఓ 2012 చట్టం కింద నమోదైన కేసుల విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక ప్రత్యేక సెషన్స్ కోర్టు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కర్నూలులో మున్సిఫ్ కోర్టు భవన సముదాయంలో ఏర్పాటు చేసే ఈ కోర్టును ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ వర్చువల్ విధానంలో అమరావతి నుంచి ప్రారంభిస్తారని జిల్లా కోర్టు పరిపాలన అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 149 కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 20,930 మంది విద్యార్థులు
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు
- పర్యవేక్షణకు ఆర్ఐఓ ఆఫీస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు


నంద్యాలలో ల్యాబ్‌లను పరిశీలిస్తున్న ఆర్ఐఓ గురువయ్య శెట్టి

కర్నూలు సిటీ/నంద్యాల సిటీ: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు రేపటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 7వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 149 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమేకాక లైవ్‌లో పర్యవేక్షించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కంట్రోల్ రూం సైతం ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగనున్నాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తుండడంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఇంటర్ బోర్డు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అలాగే పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందుగానే నిధులు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో ప్రాక్టికల్ పరీక్షలకు సకాలంలో నిధులు మంజూరు అయ్యేవి కాదు. దీంతో ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన కాలేజీల్లోని ల్యాబ్‌ల్లో ప్రాక్టికల్ పరీక్షలకు అవసరమైన పరికరాలు, రసాయనాల కొనుగోలుకు ఇబ్బంది ఉండేది. ఇప్పుడు ఏ పరీక్ష కేంద్రంలో కూడా అలాంటి పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

283 కాలేజీల నుంచి 20,930 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 283 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 43, ఏపీ మోడల్ స్కూళ్ల కాలేజీలు 34, ఎయిడెడ్ కాలేజీలు 04, ఏపీ సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 13, ఏపీ రెసిడెన్షియల్ కాలేజీలు 02, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలు 03, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు 51, ప్రైవేట్ కాలేజీలు 113, కార్పొరేట్ కాలేజీలు 18 ఉన్నాయి. ఈ కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న 20,930 మంది విద్యార్థులు రేపటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు.

ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు

ఈనెల 27 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జరిగే ఇంటర్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి కేంద్రంలో కూడా సీసీ కెమెరాలు అమర్చి లైవ్‌స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. ఉమ్మడి జిల్లాలో మొత్తం 149 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రశ్నాపత్రం పరీక్ష సమయానికి అర గంట ముందుగా మాత్రమే ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రైవేట్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోకి ఆయా కాలేజీలకు చెందిన వారు వెళితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

– గురువయ్య శెట్టి, ఆర్ఐఓ

ఫర్టిలైజర్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

వెల్దుర్తి: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కేశవరెడ్డి, ఏఈ సిద్ధయ్య, ఎస్ఐ జయన్న స్థానిక ఏఓతో కలిసి దుకాణాల్లో రిజిస్టర్లు, స్టాకు బోర్డులు, లైసెన్స్ పత్రాలు, గోడౌన్‌లో నిల్వలు పరిశీలించారు. లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు గుర్తించి రూ.28,332 విలువగల యూరియా, డీఏపీ ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని దుకాణదారులకు అధికారులు హెచ్చరించారు.

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు

- లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకోవాలి
- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు


అలువాల జగనన్న కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

గోనెగండ్ల: సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలను ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని అలువాల, కులుమాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని, త్వరగా గృహాలు కట్టుకోవాలని సూచించారు. స్టీల్, ఇసుక, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అధికారులు కూడా గృహ నిర్మాణాల వేగవంతంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కులుమాల గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు వెనుకబడి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ ఆదేశించారు. కులుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఈ ఏడాది ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, హౌసింగ్ డీఈ, ఏఈ ప్రసాద్, లక్ష్మన్న, ఎంఈఓ వినోద్ కుమార్, ఈఓఆర్డీ నాగేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు మరింత మెరుగుపడాలి

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ


మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాల సేవలు మరింత మెరుగుపడాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ అన్నారు. శనివారం స్థానిక బీ.క్యాంప్‌లోని కర్నూలు అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో రాయలసీమ జిల్లాల ఐసీడీఎస్ పీడీలు, సీడీపీఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించాలని, వీటిపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, సమస్య తీవ్రంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లోని నేషనల్ హెల్త్ మిషన్ కేంద్రాలకు తరలించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా పోషక ఆహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే కేంద్రాలను సీడీపీఓలు, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మీదేనని చెప్పారు. సమావేశంలో కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల ఐసీడీఎస్ పీడీలు కేఎల్ఆర్‌కే కుమారి, శ్రీదేవి, లక్ష్మి కుమారి, ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్లు పద్మిని, సౌజన్య, మంజులవాణి, సీడీపీఓలు అనురాధ, నిర్మల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు


మృతి చెందిన నారాయణస్వామి (ఫైల్)

దొర్నిపాడు: బంధువుల వివాహానికి బయలుదేరిన ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి(63), అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి బైక్‌పై ఆళ్లగడ్డలో జరిగే బంధువుల వివాహానికి బయలుదేరారు. మార్గమధ్యలో దొర్నిపాడు శివారులో చాకరాజువేముల పొలాల దారి నుంచి పొట్టులో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న నారాయణస్వామి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య వెంకటసుబ్బమ్మతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనారిటీ – బాలురు),
విష్ణుటౌన్ షిప్, క్రొత్త ఊద్ధ, (హైదరాబాద్ రోడ్), కర్నూలు - 3

టెండరు ప్రకటన తేది: 26.02.2023

కర్నూలు జిల్లాలో నిర్వహించబడుతున్న ఆం.ప్ర. గురుకుల పాఠశాల (మైనారిటీ - బాలికలు) పంచలింగాల, కర్నూలు మరియు ఆం.ప్ర. ఉర్దూ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు) కల్లూరు ఎస్టేట్, కర్నూలు వారికి ఆర్.ఓ. ప్లాంటు ఏర్పాటుకై జిల్లాలోని ఆసక్తి గల సంస్థలు / షాప్స్ నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ఫారాలు కన్వీనర్ గురుకుల పాఠశాల నుండి ఆఫీసు పనివేళల్లో రూ. 1000/- చెల్లించి 08-03-2023 తేదిలోపు పొందగలరు. సీల్డు టెండరు కవర్లు 10-03-2023న 3.00 PM లోపల పాఠశాల ఆఫీసులో ఉంచిన టెండరు బాక్సు నందు వేయవలెను. సీల్డ్ కవర్లు తేది 13-03-2023న 11.00 AM కు జాయింట్ కలెక్టర్, కర్నూలు జిల్లా గారి ఎదుట హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరచి ఖరారు చేయబడును.

జిల్లా జాయింట్ కలెక్టర్ గారి అనుమతితో

కన్వీనర్ / ప్రిన్సిపాల్, ఆం.ప్ర. గురుకుల పాఠశాల (మైనారిటీ-బాలురు): కర్నూలు - 3



● చేనుకు చీర.. పంటకు రక్ష

పంటలు కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగం చేశారు. రబీలో సాగు చేసిన వేరుశనగ పైరును అడవి పందుల బారి నుంచి రక్షించుకునేందుకు పొలం చుట్టూ రంగురంగుల చీరలు కట్టారు. అంబాపురం, గోరుమాను కొండ, సీతారామాపురం తదితర గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

– బేతంచెర్ల